

# ఇండీ రేసింగ్ అదుర్స్

**అరంగేట్రం సీజన్‌లోనే మూడో స్థానం**

**ఎఫ్ఐఎం-ఈ ఎక్స్‌ప్లోరర్ వరల్డ్‌కప్**

క్రాన్స్ మెంటానా(స్విట్జర్లాండ్): భారత తొలి ఎలక్ట్రిక్ బైక్ రేసింగ్ జట్టు 'ఇండీ రేసింగ్' కొత్త చరిత్ర లిఖించింది. ఎఫ్ఐఎం-ఈ ఎక్స్‌ప్లోరర్ వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగిన తొలిసారే మూడో స్థానంలో నిలిచి సత్తాచాటింది. స్విట్జర్లాండ్ లోని క్రాన్స్ మెంటానా వేదికగా జరిగిన మోగాటోర్నీ చివరి రౌండ్‌లో ఇండీ రేసింగ్ మహిళా రైడర్ శాండ్రా గోమెజ్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. మహిళల విభాగంలో గోమెజ్ చాంపియన్‌షిప్ టైటిల్ గెలువగా, ఓవరాల్‌గా ఇండీ రేసింగ్ మూడో స్థానంలో నిలిచింది. ప్రపంచకప్‌లో భాగంగా జరిగిన నాలుగు రేసుల్లో ఇండీ రేసింగ్ 479 పాయింట్లు సాధించగా, బోనెల్ రేసింగ్ (498), హోండా రేసింగ్ టీమ్ (490) తొలి రెండు స్థానాలు దక్కించుకున్నాయి. మహిళల కేటగిరీలో గోమెజ్ 271 పాయింట్లతో సీజన్ విజేతగా నిలిచింది. ప్రపంచ ఈ-రేసింగ్ టోర్నీలో భారత్‌కు పతకం దక్కడం సంతోషంగా ఉందని ఇండీ రేసింగ్ యజమాని అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. పోటీకి దిగిన తొలి సీజన్‌లోనే రాణించడం గర్వంగా ఉందన్నారు.

# భారత దేశవాళీ క్రికెట్ భేష్

- **లంకాషైర్ సీఈవో డేనియల్ గిడ్నీ**

లండన్: క్రికెట్‌కు పుట్టినిల్లు అయిన యూకేలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'కౌంటీ చాంపియన్‌షిప్' ప్రతిష్ట నానాటికీ మసకబారుతుందని, కానీ భారత్‌లో దేశవాళీ క్రికెట్ మాత్రం అద్భుతంగా పురోగమిస్తుందని లంకాషైర్ సీఈవో డేనియల్ గిడ్నీ అభిప్రాయపడ్డాడు. అంతర్జాతీయ స్థాయిలో ఆడే ఆటగాళ్లతో దేశవాళీలు ఆడించడం మంచి విషయమని ప్రశంసలు కురిపించాడు. ఇంగ్లండ్ క్రికెటర్లు కౌంటీ చాంపియన్‌షిప్‌ను పెద్దగా పట్టించుకోరని.. అయితే ఇందులో ఆటగాళ్ల, అడ్మినిస్ట్రేటర్లు, కోచ్‌ల కంటే ఏజెంట్ల పాత్ర కీలకమని చెప్పాడు. వారి వల్లే కౌంటీ క్రికెట్ భవిష్యత్ ప్రమాదంలో పడిందని ఆయన అన్నాడు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గిడ్నీ మాట్లాడుతూ.. 'ఒక గవర్నింగ్ బాడీ ఇలా (జాతీయ జట్టు క్రికెటర్లు దేశవాళీలో ఆడేలా ఆదేశించడం) చెప్పడం గొప్ప విషయం. కానీ మాకు (ఇంగ్లండ్‌లో) అలా జరగడం లేదు. ఇక్కడ ఉండే ఏజెంట్లు కౌంటీ చాంపియన్‌షిప్‌ను అసలు కేర్ చేయరు. ఇంగ్లండ్ ఆటగాళ్లు కౌంటీలు ఆడేందుకు ఇష్టపడరు' అని అన్నాడు.

# టీమ్ యూరప్‌దే లేవర్ కప్



బెర్లిన్ (జర్మనీ): టెన్నిస్‌లో ప్రతిష్టాత్మక లేవర్ కప్ ట్రోఫీని టీమ్ యూరప్ సొంతం చేసుకుంది. స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కారజ్ సింగిల్స్‌తో పాటు డబుల్స్ విభాగంలోనూ సత్తాచాటి టీమ్ యూరప్‌నకు ఐదో లేవర్ కప్ ట్రోఫీని అందించాడు. తొలి సింగిల్స్‌లో అల్కారజ్.. 6-2, 7-5తో టేలర్ ఫ్రిట్జ్‌ను ఓడించాడు. కానీ రెండో సింగిల్స్‌లో మెద్వెదెవ్ 7-6 (8/6), 5-7, 7-10తో ఓటమి పాలయ్యాడు. మూడో సింగిల్స్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-7 (5/7), 7-5, 10-5తో ఫ్రాన్సిస్ టియాఫోను ఓడించాడు. డబుల్స్ విభాగంలో అల్కారజ్-రూడ్ ద్వయం 6-2, 7-6 (8/6)తో టియాఫో-షెల్టన్‌ను ఓడించడంతో టీమ్ యూరప్ 13-11తో టీమ్ వరల్డ్‌ను ఓడించి టైటిల్ గెలిచింది.

**చెస్ ఒలింపియాడ్‌లో మెరిసిన ఓరుగల్లు బిడ్డ**

# కింగ్ అర్జున్

**అద్భుత ప్రదర్శనతో రెండు స్వర్ణాలు కైవసం**

**భారత్ చారిత్రక విజయంలో కీలక భూమిక**

నమస్తే ప్రత్యేకం





ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత్ విజయ పతాక ఎగురవేసింది. హంగరీ దేశాన మువ్వన్నెల పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. ఇన్నాళ్లు అందని ద్రాక్షగా ఊరిస్తూ వచ్చిన ఒలింపియాడ్‌లో పసిడి పతక ధమాకాతో కొత్త చరిత్ర లిఖించింది. ఓపెన్, మహిళల విభాగాల్లో స్వర్ణాలు కైవసం చేసుకుని భారత్ సత్తాచాటింది. ఈ చారిత్రక విజయంలో మన తెలంగాణకు చెందిన ఇరిగేసి అర్జున్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. దేశానికి పసిడి పతకం అందించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న ఈ ఓరుగల్లు ముద్దుబిడ్డ అనుకున్నది సాధించాడు. వరుస విజయాలతో ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నంలా నిలుస్తూ చిరకాల కలను సాకారం చేయడంలో కీలకమయ్యాడు. రౌండ్ రౌండ్‌కు గెలుపు వాడిని పెంచుకుంటూ పోయిన అర్జున్ వ్యక్తిగత స్వర్ణం సహా టీమ్ ఈవెంట్‌లో పసిడి కొల్లగొట్టి ఔరా అనిపించాడు. ప్రత్యర్థి ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ భారత్‌ను గెలుపు సంబురాల్లో ముంచెత్తిన అర్జున్ 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలు పంచుకున్నాడు.

**చెస్ ఒలింపియాడ్‌లో భారత్ విజయంపై?**

❖ సుదీర్ఘ చరిత్ర కల్గిన చెస్ ఒలింపియాడ్‌లో భారత్ చిరస్మరణీయ విజయం చిరకాలం గుర్తుండిపోతుంది. మేము ప్రాతినిధ్యం వహించిన ఓపెన్ విభాగంతో పాటు మహిళల కేటగిరీలోనూ భారత్ పసిడి పతకాలతో మెరువడం మరిచిపోలేనిది. ఇప్పటి వరకు సాధ్యపడని డబుల్ ధమాకా(రెండు స్వర్ణాలు) ప్రదర్శన ఇన్నేండ్లకు సాధ్యపడింది. టోర్నీ ఆసాంతం ప్లేయర్లందరూ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయని నైజంతో ముందుకుసాగుతూ ట్రోఫీ కైవసం చేసుకున్నాం.

**మెగాటోర్నీలో మీపై అంచనాలు?**

❖ ఒలింపిక్స్‌కు సమానంగా భావించే చెస్ ఒలింపియాడ్‌లో టోర్నీకి ముందు నాపై పెద్దగా అంచనాలేమి లేవు. అదీ నా విజయానికి కారణమైందని చెప్పొచ్చు. చెస్ ఒలింపియాడ్ కోసం ప్రత్యేకంగా దృష్టిపెట్టలేదు. సాధారణ టోర్నీల్లాగే బరిలోకి దిగాను. కానీ ఈసారి ఎలాగైనా స్వర్ణం సాధించాలన్న లక్ష్యాన్ని మనసులో అనుకున్నాను. ఇలా చేయడం వలన ఒత్తిడి దరిచేరకుండా చేయవచ్చున్న ఆత్మవిశ్వాసంతో సాగడం కలిసివచ్చింది.

**ఈ విజయాన్ని ఎలా ఆస్వాదిస్తున్నారు?**

❖ ఇన్నేండ్ల నా కెరీర్‌లో దక్కిన అపూర్వ విజయాన్ని బాగా ఆస్వాదిస్తున్నాను. నాపై పెట్టుకున్న అంచనాలను వమ్ముచేయకుండా జట్టు విజయంలో కీలకమైనందుకు సంతోషంగా ఉంది. జట్టు వ్యూహాల్లో భాగంగా నేను, గుకేశ్ ప్రత్యర్థుల ఎత్తులకు చిక్కకుండా ముందుకు సాగాం. ముందే నిర్దేశించుకున్న వ్యూహం ప్రకారం గుకేశ్ తొలి బోర్డులో ఆడితే నేను మూడో బోర్డులో పోటీకి దిగడం కలిసివచ్చింది. టోర్నీ తొలి రౌండ్లలో ఒకింత తడబడినా..ప్రత్యర్థులకు తలొగ్గలేదు. ఆడిన 11 రౌండ్లలో 10 పాయింట్లతో టాప్‌లో నిలిచినందుకు గర్వంగా ఉంది. మొత్తం 11 రౌండ్లలో తొమ్మిది విజయాలు రెండు డ్రాలు ఎదుర్కొన్నాను. డ్రా అయిన రెండింటిలో గెలిచే అవకాశాన్ని తృటిలో చేజార్చుకున్నాను.

**టోర్నీలో మరిచిపోలేని సందర్భం?**

❖ టోర్నీ మొత్తమ్మీద అమెరికాతో జరిగిన 10వ రౌండ్ పోరు హోరాహోరీగా సాగింది. స్వర్ణం సాధించాలంటే తప్పక గెలువాల్సిన పరిస్థితుల్లో మన ప్లేయర్లు సత్తాచాటారు. తొలుత ఫాబియానో కరువానపై గుకేశ్ గెలువడం కలిసొచ్చింది. అయితే వెస్లీ చేతిలో ప్రజ్ఞానంద ఓడిపోవడం, లెవాన్ ఆరోనియాన్‌తో విదిత్ గుజరాతి గేమ్ డ్రా చేసుకోవడంతో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. కీలకమైన ఆఖరి పోరులో నేను డోమింగెజ్ పెరెజ్‌పై గెలువడంతో భారత్ 2.5-1.5తో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. దీంతో మరో రౌండ్ మిగిలుండగానే 19 పాయింట్లతో టాప్‌లోకి దూసుకొచ్చాం. చివరిదైన 11 రౌండ్‌లో స్లొవేనియాపై 3.5-0.5తో విజయంతో స్వర్ణం మన ఖాతాలో చేరింది.

**మహిళల విజయంపై మీ స్పందన?**

❖ టోర్నీలో మాతో పాటు మహిళల విభాగంలోనూ స్వర్ణం దక్కడం చారిత్రక సందర్భం. ద్రోణవల్లి హారిక లాంటి సీనియర్లకు తోడు వంతిక అగర్వాల్, దివ్యా దేశ్‌ముఖ్, తానియా సచ్‌దేవ్, వైశాలి అద్భుత ప్రదర్శన కనబరిచారు.

**భవిష్యత్ లక్ష్యాలేంటి?**

❖ నాకంటూ సుదీర్ఘమైన లక్ష్యాలేమి లేవు. టోర్నీకి టోర్నీకి ప్రాధాన్యం మారుతూ ఉంటుంది. అక్టోబర్‌లో లండన్ వేదికగా గ్లోబల్ చెస్ లీగ్ జరుగబోతున్నది. ఐపీఎల్ తరహాలో ఫ్రాంచైజీలు ప్రాతినిధ్యం వహించే లీగ్‌లో ఆడబోతున్నాను. ఇదో వైవిధ్యమైన టోర్నీ. వివిధ దేశాల ప్లేయర్లతో కలిసి ఆడటం కొత్త అనుభూతిని ఇస్తుంది.

## ఫైనల్స్‌కు బాంబ్రీ జోడీ

ఢిల్లీ: చైనా వేదికగా జరుగుతున్న రెండు ఏటీపీ 250 టోర్నీలలో భారత టెన్నిస్ ఆటగాళ్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఏటీపీ 250 చెంగ్డూ ఓపెన్ డబుల్స్ సెమీస్‌లో భారత టెన్నిస్ ఆటగాడు యూకీ బాంబ్రీ, తన ఫ్రెంచ్ సహచరుడు అల్బానో ఒలివెట్టి జోడీ ఫైనల్స్‌కు చేరింది. సెమీస్‌లో ఈ ఇండో-ఫ్రెంచ్ ద్వయం.. 6-3, 7-6తో ఇవాన్ డొడిగ్ (క్రొయేషియా), రఫెల్ మా టోస్ (బ్రెజిల్)ను ఓడించింది. ఇక హాంగ్జో ఓపెన్‌లో మరో భారత జోడీ జీవన్- విజయ్ 0-6, 6-2, 10-4తో మూడో సీడ్ బెహర్(ఉరుగ్వే), రాబర్ట్ (యూఎస్ఏ)ను చిత్తు చేసింది.

## దక్షిణాఫ్రికాకు ఓదార్పు విజయం



షార్జా: అఫ్గానిస్థాన్ చేతిలో వరుసగా రెండు వన్డేలు ఓడి సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికాకు ఓదార్పు విజయం దక్కింది. ఆదివారం రాత్రి ముగిసిన మూడో వన్డేలో 7వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత అఫ్గన్‌ను 34 ఓవర్లలో 169 పరుగులకే ఆలౌట్ చేసిన సఫారీలు.. ఛేదనను 33 ఓవర్లలోనే పూర్తిచేశారు. ఆఖరి మ్యాచ్‌లో ఓడినా అఫ్గన్లు సిరీస్‌ను 2-1తో గెలిచి చరిత్ర సృష్టించారు.

## లంకదే తొలి టెస్టు



గాలె: సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో శ్రీలంక 63 పరుగులతో జయకేతనం ఎగురవేసింది. 275 పరుగుల ఛేదనలో భాగంగా కివీస్ 211 పరుగులకే ఆలౌట్ అయింది. ఆఖరి రోజు ఆ జట్టు విజయానికి 68 పరుగులు కావాల్సి ఉండగా ఆ జట్టు మరో 5 పరుగులే జతచేయగలిగింది. న్యూజిలాండ్ భారీ ఆశలు పెట్టుకున్న రచిన్ రవీంద్ర (92) ఒక్క పరుగు మాత్రమే జోడించి ఔటయ్యాడు. లంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య ఐదు (5/68) వికెట్లతో విజృంభించాడు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.